క్లుప్తంగా

పుస్తక పఠనంతో విజ్ఞానం

టంగుటూరు: పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని గ్రంథాలయ నిర్వాహకుడు జి.వర్ధనరాజు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చిన్న నాటి నుంచి పుస్తకపఠనం అలవాటు చేయడం అలవర్చాలన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కొండపి: మండలంలోని పెట్లూరులో సహజానంద పబ్లిక్ స్కూల్లో అడ్డాల పద్మావతి జ్ఞాపకార్థం శంకర హాస్పిటల్ పెద్దకాకాని సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 796 మందికి పరీక్షలు చేయగా 540 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. హైస్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసరావు, శంకర హాస్పిటల్ వైద్యులు డాక్టర్ శ్రీనిజ, డాక్టర్ మహిత, డాక్టర్ శతిక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న అగ్నిమాపక శాఖాధికారి వెంకటరావు

కొండపి: అప్రమత్తత, సమయస్ఫూర్తితో ఉంటే ప్రమాదాలను నివారించవచ్చని అగ్నిమాపక శాఖ అధికారి సీహెచ్ వెంకటరావు అన్నారు. స్థానిక అగ్నిమాపక కేంద్రంలో అగ్ని ప్రమాదాల నివారణపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాలు, పాఠశాలలు, ఆస్పత్రులు, గోదాములు, గిడ్డంగులు, కర్మాగారాల్లో ప్రమాద కారకాలకు దూరంగా ఉంచాలన్నారు. హ్యాపీ కిడ్స్ పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.
కనిగిరిరూరల్: అవగాహన తోనే అగ్ని ప్రమాదాల నివారణ సాధ్యమని అగ్ని మాపక అధికారి సీహెచ్ బంగారు బాబు అన్నారు. జాతీయ అగ్ని మాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా అవగాహన కార్యక్రమం, ముగింపు వారోత్సవాల సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, నివారణ చర్యలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న మంత్రి స్వామి

కొండపి: ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి స్వామి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఆదివారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో చదువుకున్న విద్యార్థులు మంచి ఉన్నత స్థాయిలో ఉన్నారని, రాష్ట్ర, జిల్లా స్థాయిలో కూడా మంచి ర్యాంకులు సాధిస్తున్నారన్నారు. అనంతరం మాధవి మెడికల్ షాప్ ఆధ్వర్యంలో అందించిన బహుమతులు, మెమొంటోలను ర్యాంకులు సాధించిన కుంచాల ప్రవళిక, పసుమర్తి హెప్సిబా, మోరపోకుల దివ్యశ్రీలకు మంత్రి అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు, మాజీ ఏఎంసీ రామయ్య, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కుబడి తంతు..!

- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫొటోలకే పరిమితమైన 'పోషణ్ పక్వాడా'
- పౌష్టికాహారంపై అవగాహన కల్పించడంలో విఫలం
- తూతూమంత్రంగా పౌష్టికాహార వారోత్సవాలు
- సెంటర్లపై కొరవడిన ఐసీడీఎస్ అధికారుల పర్యవేక్షణ



పొన్నలూరులో మొక్కుబడిగా సెంటర్ ముందు దిగిన ఫొటో

పొన్నలూరు:

గ్రామాల్లోని అంగన్‌వాడీ సెంటర్ల పరిధిలో గర్భిణులు, బాలింతలతో పాటు కిశోర బాలికలకు, ఆరేళ్ల లోపు చిన్నారులు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తూ ఏటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే 'పోషన్ పక్వాడా' సక్రమంగా సాగడం లేదు. ఈ ఏడాది ఈ నెల 8 నుంచి నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారం, బాల్య వివాహాలు వంటి ప్రత్యేక అంశాలపై ర్యాలీలు, సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించాలి. కానీ ఈ కార్యక్రమం చాలా ప్రాంతాల్లో సక్రమంగా నిర్వహించడం లేదు. వాస్తవానికి గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లోపంతో సరైన సమయంలో పౌష్టికాహారాన్ని తీసుకోకపోవడంతో రక్తహీనత సమస్య ఏర్పడి గర్భిణులు ప్రసవం సమయంలో మృత్యువాత పడుతున్నారు. అలాగే బాలింతలకు కూడా పౌష్టికాహారం తీసుకోవడంలో సరైన అవగాహన లేకా అనారోగ్యానికి గురవుతున్నారు. ఇలాంటి వాటిని అరికట్టడానికి అంగన్‌వాడీ కేంద్రాలను వేదికగా చేసుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలకు, చిన్నారులకు చేరువ చేయాలి. కానీ నేడు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇలాంటి పరిస్థితి లేదు. పౌష్టికాహారం అందించడం పక్కన పెటితే దీనిపై అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారు. గ్రామాల్లో ప్రత్యేక ర్యాలీలు సదస్సులు ఏర్పాటు చేసి గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలను చైతన్యం చేయాల్సి ఉన్నా కార్యక్రమం చేసినట్లుగా అంగన్‌వాడీ కేంద్రం ముందు ఒక ఫొటో, కేంద్రం లోపల ఒక ఫొటో తీసి ఉన్నతాధికారులకు పంపిస్తూ చేతులు దులుపుకుంటున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు ఆరోగ్య సూత్రాలు, పౌష్టికాహార ప్రాముఖ్యత, తమ ఇంటి దగ్గర ఆకు కూరలు, కూరగాయలు పెంపకం, బాల్య వివాహాలు వల్ల జరిగే అనర్థాలు, కిశోర బాలికల శారీరక మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అనేక అంశాలు తెలియజేయడానికి ప్రభుత్వాలు ఇటు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అయితే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇలాంటి కార్యక్రమాలు మొక్కుబడిగా తప్పా క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నారు. ముఖ్యంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్థాయి అధికారితో పాటు అంగన్‌వాడీ కార్యకర్తల మధ్య కొన్ని ఒప్పందాలతో సెంటర్ల పర్యవేక్షణ కూడా కొరవడింది. ఐసీడీఎస్ మండల స్థాయి సూపర్‌వైజర్లు కూడా పట్టీపట్టనట్లు ఉండటంతో ఏ కార్యక్రమం కూడా సక్రమంగా జరగడం లేదు. అంగన్‌వాడీలు కార్యక్రమం చేసినట్లు ఉన్నతాధికారులకు చెప్పుకోవడానికి సెంటర్‌లో, సెంటర్ ముందు బ్యానర్ పట్టుకొని ఫొటో దిగి దాన్ని ఉన్నతాధికారులకు పంపిస్తూ మొక్కుబడిగా వ్యవహరిస్తున్నారు. అయితే ఇలాంటి మొక్కుబడి కార్యక్రమాలు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సమక్షంలో జరగడం కొసమెరుపు. మొత్తంగా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో జరగాల్సిన చాలా కార్యక్రమాలు తూతూమంత్రంగా తప్ప వాటి లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి

మండలం	కేంద్రాలు	గర్భిణులు	బాలింతలు	చిన్నారులు
పొన్నలూరు	55	161	153	1200
మర్రిపూడి	54	191	229	857
కొండపి	57	191	229	754
ఎస్ కొండ	70	420	180	2800
టంగుటూరు	93	620	800	3200
జరుగుమల్లి	52	130	250	800

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు



పొన్నలూరులో వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై అనూక్



సీతారాంపురంలో మాట్లాడుతున్న ఎస్సై మాధవరావు

పొన్నలూరు: మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే చర్యలు తప్పవని ఎస్సై అనూక్ హెచ్చరించారు. పొన్నలూరులో ఓవీ రోడ్డుపై సోమవారం వాహనాలు తనిఖీ చేపట్టి అనుమతి పత్రాలతో పాటు, హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తున్న వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా బైక్‌లు నడుపుతున్న మైనర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ మైనర్లు బైకులు నడుపుతూ పట్టుబడితే వారితో పాటు తల్లిదండ్రులపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. చిన్న వయసులో వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడవద్దని సూచించారు. లైసెన్స్ లేకపోయినా, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
హనుమంతునిపాడు: మద్యం సేవించి వాహనాలు నడిపినా, బహిరంగంగా మద్యం సేవించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎం మాధవరావు అన్నారు. మండలంలోని సీతారాంపురంలో వాహనదారులు, గ్రామస్తులతో ఆదివారం మాట్లాడారు. మద్యం బహిరంగంగా తాగుతూ ప్రజలకు ఇబ్బంది కలిగించే వారిపై చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు చేరుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎంసీ చైర్మన్ వెంకట మురళి

మర్రిపూడి: విద్యార్థులు పట్టుదల, క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎస్ఎంసీ చైర్మన్ పల్లా వెంకటమురళి అన్నారు. మండలంలోని గార్లపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన పాఠశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. గ్రామస్తుల సహకారంతో నిర్మించిన కళాప్రాంగణం, డైనింగ్ హాల్, ఆర్వోప్లాంట్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. బొమ్మిరెడ్డిపల్లెకు చెందిన కాంట్రాక్టర్ తూము కృష్ణారెడ్డి 500 మంది విద్యార్థులకు భోజన వసతి కల్పించారు. పలువురు దాతలు పాఠశాలకు పలు పరికరాలు బహూకరించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రధానోపాధ్యాయుడు తూగుట్ల బిక్షాల్‌రెడ్డి, డి.వెంకటేశ్వర్లు, డి.కోటేశ్వరరావు, ఏ కొండారెడ్డి, డి. నరసింహారావు, పి.వెంకటేశ్వర్లు, సీహెచ్ వాసు, పి.ఆదినారాయణ. ఎం వెంకటేశ్వరరెడ్డి, మాధవశర్మ, శ్రీరాం మురళీ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ, అభిషేకం



మహానైవేద్య ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు



గోపూజ నిర్వహిస్తున్న అర్చకులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం నారాయణస్వామి అభిషేకోత్సవం అర్చకులు శ్రీమంకాల శివప్రసాద్ వేద మంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న గోశాలలో గోపూజ నిర్వహించారు. అనంతరం మహానైవేద్యంతో వేడుకగా భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయ ప్రదక్షిణ చేసి స్వామికి నైవేద్యంగా సమర్పించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు, ఆలయ మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, దుద్దుకూరి శ్రీనివాసులు, చావా సుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు



పామూరు ఈస్టర్ ప్రార్థనల్లో క్రైస్తవులు



దైవసందేశాన్ని వివరిస్తున్న రెవరెండ్ ఫాదర్ నేరెళ్ల జగన్

కొండపి: మండలంలో ఈస్టర్ వేడుకలు ఘనంఘా నిర్వహించారు. మానవాళి కోసం శిలువలో ప్రాణ త్యాగం చేసిన ఏసుక్రీస్తు మూడో రోజు సమాధి నుంచి సజీవంగా తిరిగివచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని వేడుకలు నిర్వహిస్తారు. పండుగను పురస్కరించుకుని మండలంలోని చర్చిలను అందంగా తీర్చిదిద్దారు. స్థానిక కుమ్మరిపాలెం షాలేము ప్రార్థనా మందిరంలో దైవ సేవకులు మైఖేల్ ఆధ్వర్యంలో దైవ సందేశాన్ని వినిపించారు. దాసిరెడ్డిపాలెంలోని హెచ్ఎస్‌పీఎం ప్రార్థనా మందిరంలో పాస్టర్ ప్రభుదాస్ ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలు నిర్వహించారు. బీసీ కాలనీలో ఎరూలేషం ప్రార్థనా మందిరంలో పాస్టర్ సాంబశివరావు ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు.
టంగుటూరు: మండలంలో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ట్రంకు రోడ్డులోని న్యూ లైఫ్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. న్యూ లైఫ్ పరిశుద్ధ ఆరాధన మందిరం, నూతన ఏరులేషము ప్రార్థనా మందిరం, అరుంధతీనగర్‌లోని అసెంబ్లీ ఆఫ్ గాడ్ చర్చిలో ఈస్టర్ సందేశాన్ని అందించారు.
సీఎస్‌పురం(పామూరు): ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. డీజీపేట చర్చిలో రెవరెండ్ ఫాదర్ నేరెళ్ల జగన్ దైవ సందేశం అందించారు. ప్రేమ, కరుణ, దయ, త్యాగం, సేవ, పాప క్షమాపణలకు ప్రతిరూపం ఏసుక్రీస్తు అని, మానవాణి క్రీస్తు మార్గాన్ని అనుసరించి సన్మార్గంలో ఉండాలన్నారు.
పొన్నలూరు: పాపాల క్షమాపణలకు ప్రతీకా ఏసుక్రీస్తు అని రెవరెండ్ పాస్టర్ చుండి ప్రభాకర్ అన్నారు. మండలంలోని వాడవాడలా ఆదివారం ఈస్టర్ పండుగను పురస్కరించుకుని క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక తెలుగు బాప్టిస్ట్ చర్చిలో క్రైస్తవులు వేకువజాము నుంచే స్తుతి గీతాలు ఆలపించి కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ ప్రభాకర్ ఈస్టర్ ప్రాముఖ్యతను బోధిస్తూ క్రీస్తు సర్వలోక పాపుల నిమిత్తం శిలువలో బలియాగం అయ్యాడన్నారు. క్రీస్తు శుభ శుక్రవారం రోజున మానవుల పాపాలు నిమిత్తం సమాధి కాబడి మూడవ రోజైన ఆదివారం పునరుత్థాన శక్తితో సజీవంగా తిరిగి లేస్తాడన్నారు. అనంతరం ప్రార్థనలో పాల్గొన్న విశ్వాసులకు అల్పాహారం పంచిపెట్టారు.
పామూరు: మండలంలోని అని చర్చిల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్‌పురం రోడ్డులోని తెలుగుబాప్టిస్టు చర్చిలో రెవరెండ్ ఆర్.జోసఫ్ దైవ సందేశం అందించారు. మానవాణి క్రీస్తు మార్గాన్ని అనుసరించి సన్మార్గంలో ఉండాలన్నారు.
కనిగిరిరూరల్: ఈస్టర్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంతో పాటు, మండలంలోని పలు చర్చిల్లో, గ్రామాల్లో ఈస్టర్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక టకారి పాలెం సీయోను క్రైస్తవ ప్రార్థన మందిరంలో విశిష్ట ప్రార్థనలు చేశారు. పాస్టర్ రూబెన్ దైవ సందేశాన్నిచ్చారు.



టంగుటూరులో దైవ సందేశం అందిస్తున్న దేవిడ్ లివింగస్టన్



పొన్నలూరులో వాక్యోపదేశం చేస్తున్న పాస్టర్ ప్రభాకర్



కనిగిరిలో ఈస్టర్ ప్రార్థనలు



కొండపిలో ప్రత్యేక ప్రార్థనల్లో దైవ సేవకులు మైఖేల్

మహా నిరసన శాంతి ర్యాలీని జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఎస్‌కే అహమ్మద్ హుస్సేనీ

కనిగిరిరూరల్: వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా, వక్ఫ్ బిల్లు సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని కోరుతూ సోమవారం కనిగిరిలో జమియతే ఉలమా- ఏ- హింద్, అంజుమన్ ఇస్లామియా కమిటీ, జేఏసీల ఆధ్వర్యంలో జరిగే మహా నిరసన శాంతి ర్యాలీని జయప్రదం చేయాలని అంజుమ కమిటీ అధ్యక్షుడు ఎస్‌కే అహమ్మద్ హుస్సేనీ పిలుపునిచ్చారు. ఆదివారం నూతన అంజుమన్ కమిటీ నాయకులతో కలిసి స్థానిక షాదీఖానాలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ కేంద్రం ఆమోదించిన వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమన్నారు. దీన్ని ఖండిస్తూ 21 తేదీ కనిగిరిలో చేపట్టే మహా నిరసన శాంతి ర్యాలీలో ఆరు మండలాల ముస్లింలు, లౌకికవాదులు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు హాజరై జయప్రదం చేయాలన్నారు. అంజుమన్ కమిటీ మాజీ అధ్యక్షుడు ఎస్‌కే రోషన్ సందాని అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నూతన అంజుమన్ కమిటీ నాయకులు ఎస్‌కే కాలేషా, ఎస్‌కే కరీముల్లా, ఎస్‌కే కే మొహమ్మద్ ఖాశిం, ఎస్‌కే పోలిచర్ల రహీం బాషా, ఎస్‌కే ముస్తాఫా పాల్గొన్నారు.
సింగరాయకొండ: కేంద్ర ప్రభుత్వ వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఈ నెల 23వ తేదీ బుధవారం తలపెట్టిన శాంతియుత ర్యాలీని జయప్రదం చేయాలని వక్ఫ్ బిల్లు వ్యతిరేక పోరాటసమితి కోరారు. ఈ మేరకు స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి శాంతియుత ర్యాలీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు షేక్ ఇస్మాయిల్, షేక్ కరీం, షేక్ కరిముల్లా, ప్రజాసంఘాల నాయకులు ఆర్ మోహన్, నాంచార్లు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

హనుమంతునిపాడు: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గాయం సావిత్రి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.రంగసుబ్బరాయుడు ఆదివారం ఒక ప్రకటలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సమావేశానికి జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరవుతారన్నారు. అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

కారు ఢీకొని తీవ్ర గాయాలు



క్షతగాత్రుడు మందా శ్రీనివాసులు



బైక్‌ను తప్పించబోయి పొలాల్లోకి వెళ్లిన కారు

పామూరు: కారు ఢీకొని మోటార్‌సైక్లిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని సీఎస్‌పురంరోడ్డు 167బీ జాతీయ రహదారి జంక్షన్ సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళితే.. సీఎస్‌పురం మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన మందా శ్రీనివాసులు మోటార్‌బైక్‌పై పామూరు వస్తున్నాడు. ఆ సమయంలో సీఎస్‌పురం రోడ్డు 167బీ జాతీయ రహదారి జంక్షన్ రోడ్డుకు కుడి పక్కన ఉన్న సోడాబండి వద్దకు వెళ్లి సోడా తాగి తిరిగి రోడ్డు ఎడమవైపుకు క్రాస్ చేస్తుండగా పామూరు నుంచి సీఎస్‌పురం వైపుకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఘటనలో మందా శ్రీనివాసులు రోడ్డుపై పడిపోగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రునికి 108 సిబ్బంది హరిబాబు, మహేష్‌లు ప్రథమ చికిత్స చేసి కందుకూరు వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.